RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ సోమవారం 13.04.2026 సంపుటి : 03 సంచిక : 127 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Monday 13.04.2026 Volume: 03 Issue 127 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH
TRADE UNION



మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# తప్పులు చేశాం..

# సరిదిద్దుకుంటాం

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**తండ్రిని ఏడిపించొద్దు**

**కవిత పార్టీ పెట్టాలనుకోవడం ఆమె వ్యక్తిగతం..**

**వ్యక్తిగత సమస్యలతో పెట్టే పార్టీలు సక్సెస్ కావు**

**జైలుకు వెళ్తే సీఎం అవుతామనుకోవడం భ్రమ..**

**పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చి నష్టపోయాం**

**మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తాం**

**కార్యకర్తలే కేంద్రంగా రాజకీయాలు చేస్తాం**

**2027లో పాదయాత్ర చేపడతా..**

**మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు**



**మంచిర్యాల, ఏప్రిల్ 12 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తన సోదరి కవిత కొత్త పార్టీ పెట్టే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలిసారి స్పందించారు. రాజకీయ పార్టీని ఎవరైనా పెట్టవచ్చునని, అయితే పదవుల కోసం, వ్యక్తిగత సమస్యలతో పెట్టే పార్టీలు సక్సెస్ కావన్నారు. పిల్లలు తండ్రిని సంతోషపెట్టకపోయినా ఫర్వాలేదు గానీ.. ఏడిపించవద్దని వ్యాఖ్యానించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత కొత్త పార్టీ పెడుతున్న అంశంపై స్పందిస్తూ.. అది ఆమె వ్యక్తిగతమన్నారు. "ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలైనా రావచ్చు. కానీ, ప్రజలు ఓట్లు వేయాలి కదా! వ్యక్తిగత బాధలు చూపిస్తే ప్రజలు నమ్మరు కదా! ఒకరిద్దరు వ్యక్తులు జైలుకు వెళ్లొచ్చి ముఖ్యమంత్రులు అయినంత మాత్రాన.. మళ్లీ అలా జరుగుతుందని అనుకోవడం పొరపాటు. జైలుకెళ్తే సీఎం అవుతారనుకోవడం భ్రమ" అని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రులుగా ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ రాష్ట్రాన్ని చరిత్రలో నిలిచిపోయేలా పాలించారని, వారి స్ఫూర్తితో తాము ముందుకెళతామని చెప్పారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాత పార్టీ రాజకీయంగా నష్టపోయిందన్నారు. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చాలంటూ ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయని, ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై తుది నిర్ణయం కేసీఆర్‌దేనన్నారు. అయితే టీఆర్ఎస్ అనే పేరు ప్రస్తుతం ఖాళీగా ఉందని, ఎవరైనా దానిని పెట్టుకోవచ్చని కవిత ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా, తమ కుటుంబంలో ఎలాంటి పదవుల గొడవలు లేవని కేటీఆర్ అన్నారు. గతంలో తాము చిన్న చిన్న తప్పులు చేశామని, ఆ లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. టీడీపీలో నాయకులు నేరుగా కార్యకర్తలతో మమేకమవుతారని, బీఆర్ఎస్‌లో అది లోపించడం వల్లే ఓడిపోయామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే కేంద్రంగా రాజకీయాలు చేశామని, ఇకపై కార్యకర్తలను కేంద్రంగా చేసుకుని రాజకీయాలు చేస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యలపై స్పందిస్తూ.. వారికి తాము కూడా పూర్తిగా న్యాయం చేయలేకపోయి ఉండవచ్చునని, అన్నీ చేశామని కూడా తాము చెప్పడం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై తాను 2027లో పాదయాత్ర చేపడతానని కేటీఆర్ ప్రకటించారు. పదేళ్ల కాలంలో పార్టీకి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని, దానిని తగ్గించేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని లోపాలను కేసీఆర్ బహిరంగంగానే అంగీకరించారని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకత్వాన్ని సమన్వయం చేసుకోవడంలో తాము విఫలమయ్యామన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి లక్షలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఉన్నప్పటికీ, వారి ప్రయోజనాల కోసం సరైన 'గల్ఫ్ పాలసీ'ని తీసుకురాలేకపోయామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కొన్ని రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఇలాంటి లోపాలు తలెత్తాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దోచుకో.. దాచుకో పథకం మాత్రమే (మిగతా2లో..)

# ఆగని కూల్చివేతలు



- ఐలాపూర్‌లో మళ్లీ దూసుకొచ్చిన హైడ్రా బుల్డోజర్
- హైకోర్టు మందలించినా మారని కూల్చివేతల తీరు
- ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇల్లు నేలమట్టం
- అడ్డుకున్న స్థానికులు.. భవనంపైకి ఎక్కిన యువకుడు
- హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యంతో పొరుగింటిపైకి శిథిలాలు

**పేదల ఇండ్ల కూల్చబోమని చెబుతూనే మళ్లీ హైడ్రా విధ్వంసం సృష్టించడంపై బాధితులు ఆగ్రహించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో ఆదివారం కూడా బుల్డోజర్లు దూసుకు రావడంతో అధికారులపై బాధితులు దుమ్మెత్తిపోశారు.**

**హైదరాబాద్, ఏప్రిల్ 12 :**

పేదల ఇండ్ల కూల్చబోమని చెబుతూనే మళ్లీ హైడ్రా విధ్వంసం సృష్టించడంపై బాధితులు ఆగ్రహించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో ఆదివారం కూడా బుల్డోజర్లు దూసుకు రావడంతో అధికారులపై బాధితులు దుమ్మెత్తిపోశారు. ఐలాపూర్‌లో సర్వే నంబర్లు 1నుంచి 220 వరకు ప్రభుత్వ భూమి అంటూ శనివారం 860 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకొని అక్కడ ఫెన్సింగ్ వేస్తున్నది. ఈక్రమంలో రెండోరోజు ఆదివారం కూడా హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లపైకి దూసుకెళ్లాయి. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న 208 సర్వే నంబర్‌లోని ఓ ఇంటిని కూల్చేందుకు వచ్చిన అధికారులతో కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు వాగ్వాదానికి దిగారు. జేసీబీ వాహనానికి అడ్డుపడ్డారు. భవనం పైకి ఎక్కిన వ్యక్తిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఆందోళన చేస్తున్న ప్రతి ఒక్కరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య భవనాన్ని కూల్చేశారు. అన్ని అనుమతులున్నా ఎలా కూల్చేస్తారని బాధితులు అధికారులను ప్రశ్నించారు. కొన్నేండ్లుగా తాము ఈ భూమిలో పంటలను సాగు చేసుకున్నామని, 2011 నుంచి ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని బాధితులు చెప్పారు. కోర్టు శనివారం ఇచ్చిన ఉత్తర్వుల్లో మరో సర్వే నంబర్ ఉన్నదని, ఈ సర్వే నంబర్‌లో నిర్మాణాలు అక్రమంగా కట్టుకున్నారంటూ హైడ్రా సిబ్బంది వారిని అక్కడినుంచి పంపేస్తూ ఎవరైనా అటువైపు వస్తే వారిని అదుపులోకి తీసుకోవడం కనిపించింది. ఒకవైపు భవనం కూల్చివేత జరుగుతుండగానే మరోవైపు ఆ శిథిలాలన్నీ పక్కనే ఉన్న మరో భవనంపై ఎగిరిపడ్డాయి. దీంతో చుట్టుపక్కల వాళ్లంతా భయాందోళన చెందారు. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యంగా చేస్తున్న కూల్చివేతలపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇదే సమయంలో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పైకి కూల్చివేస్తున్న ఇంటి గోడ పడటంతో అపార్టుమెంట్‌లోని ప్రజలు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడంతో హైడ్రా సిబ్బంది పక్క అపార్టుమెంట్‌పై పడిన గోడను తీసేశారు. ఐలాపూర్‌లో ముఖీం ఫాంహౌస్‌ను పూర్తిస్థాయిలో నేలమట్టం చేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతేగాక 1నుంచి 220 సర్వేనంబర్ గల భూముల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో కూడా అధికారులు ఫెన్సింగ్ వేయించేలా చర్యలు తీసుకున్నారు. రెండో రోజు ఆదివారం ఉదయం నుంచే హైడ్రా అధికారులు, పోలీసులు, హైడ్రా సిబ్బంది ఐలాపూర్‌లో హడావుడిగా కనిపించారు. ఐలాపూర్ సహా చుట్టుపక్కల ఉన్న తండాల్లో హైడ్రా, పోలీసుల వాహనాల సైరన్లతో స్థానికులు ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కనిపించారు.

**జూలై 3 నుంచి**

# అమర్‌నాథ్ యాత్ర

**ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్**



**శ్రీనగర్ :** అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28 వరకు కొనసాగనుంది. 57 రోజుల పాటు జరిగే ఈ యాత్ర మొదటి బ్యాచ్ జూలై 1న ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. యాత్ర కోసం ఈ నెల 15 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఎల్‌జీ సిన్హా ఆదివారం రాజ్‌భవన్‌లో ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 13 నుంచి 70 ఏండ్లలోపు వయసు గల వారిని యాత్రకు అనుమతిస్తారు. సంప్రదాయ నున్వాన్-పహల్గాం, బలతల్-గండేర్‌బల్ మార్గాల్లో యాత్ర సాగుతుంది. దేశవ్యాప్తంగా నిర్దేశిత 556 బ్యాంక్ శాఖల్లో లేదా శ్రీ అమర్‌నాథ్‌జీ ష్రైన్ బోర్డ్ వెబ్‌సైట్‌లో యాత్రికులు తమ పేరు నమోదు చేసుకోవచ్చు. యాత్రికులకు ఈసారి ఆర్ఎఫ్ఐడీ కార్డులను అందించి వారి భద్రతను ట్రాక్ చేయనున్నారు. వారి ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచారు.

# ఆర్‌సీబీ ధనాధన్..

**సాల్ట్, కోహ్లి,**
**పటిదార్ వీర విహారం**

**ముంబైపై బెంగుళూరు**
**అద్భుత విజయం**



4లో..

# ‘ఓ’ సిటీలో ఘనంగా 6వ విడత ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం



**భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది**

**“ఓ” సిటి రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జోగు చంద్రశేఖర్**

జనోదయ : వరంగల్ ప్రతినిధి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా “ఓ” సిటీ లో నిర్వహిస్తున్న 6వ విడత ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం విజయవంతం అయ్యింది.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజం కోసం నడుంబిగించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జోగు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాలనీని పచ్చదనంతో నింపాలని కోరారు. ప్లాస్టిక్ రహిత “ఓ” సిటీ కోసం ప్రతిజ్ఞ చేశారు. సుమారు 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని మున్సిపల్ అధికారులకు అప్పగించడం జరిగింది. పర్యావరణం పై అవగాహన కల్పిస్తూ.. నిర్వహించిన ఈ ర్యాలీ వివిధ ప్రధాన వీధులలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్లు, స్వచ్ఛంద సేవకులు, కాలనీ పెద్దలు, మహిళా కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, జవాన్లు రాజు, విజయ్ కుమార్ పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించారు., “ప్లాస్టిక్ ను ఏరి వేద్దాం – ప్రకృతిని కాపాడుదాం” ప్లాస్టిక్ రహిత “ఓ” సిటీగా తీర్చిదిద్దుతాం అనే నినాదంతో కార్యక్రమం ముగిసింది.

# పేదల సొంత ఇంటి కల నెరవేర్చడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం**

**పేదల సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరుతుంది**

**నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు**



జనోదయ : వరంగల్ ప్రతినిధి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని పర్వతగిరి మరియు సోమారం గ్రామాలకు సంబంధించిన బత్తుల శ్రీదేవి – కృష్ణ, లావుద్య మోతీ – కి.శే రణ్య, కుంచాల రజిత –రవి, లాశెట్టి స్వరూప – శ్రీను ల కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్ల 5 లక్షల రూపాయలతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసిన, సందర్భంగా లబ్ధిదారులను శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రతి పేద కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపాలంటే వారికి సొంత ఇంటి సౌకర్యం కలగడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఆ లక్ష్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేయడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.పేద కుటుంబాలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను నెరవేర్చడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒక కుటుంబానికి ఇల్లు అంటే అది కేవలం గోడలు, పైకప్పు మాత్రమే కాకుండా భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకం కలిగించే స్థలం అని చెప్పారు. పేదలు కూడా గౌరవంగా జీవించాలి అనే సంకల్పంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాలు ఉండకుండా దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని, ప్రతి పేద కుటుంబం సంతోషంగా జీవించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ.. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో ఆగని అక్రమ మట్టి దందా



జనోదయ : మంథని

మంథని ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా రోజు రోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆదివారాల్లో రెవెన్యూ అధికారుల తనిఖీలు లేకపోవడంతో మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అటవీ ప్రాంతాలు, చెరువులు, గుట్టలు, కొండలను లక్ష్యంగా చేసుకొని ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.ఇటీవల పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఈ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.ఇప్పటికైనా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని, ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

# మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన వివరాలు



జనోదయ : మంథని

సోమవారం ఉదయం 8 గంటలకు మంథని శ్రీపాద చౌక్ వద్ద శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించి చలివేంద్రం ప్రారంభిస్తారు. 9 గంటలకు క్యాంప్ కార్యాలయంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్, విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. 10 గంటలకు లక్ష్మీనారాయణ ఆలయం వద్ద వార్డు కార్యాలయం, రావుల చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు శ్రీపాద కాలనీలో విగ్రహ ఆవిష్కరణ. మధ్యాహ్నం 12:30కు వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం.అనంతరం ముత్తారం, మచ్చుపేట, రామగిరి, కమాన్‌పూర్,మలహర్‌రావు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# తప్పులు చేశాం..సరిచేసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

నడుస్తోందని కేటీఆర్ అన్నారు. అందుకే ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం మంచిర్యాలలో బీఆర్ఎస్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లో కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను అడ్డం పెట్టుకొని సృజన్‌రెడ్డి రూ.వేల కోట్లు సంపాదిస్తున్నారని ధ్వజమెత్తారు. తాము ఇచ్చిన 16వేల వారసత్వ ఉద్యోగాలపై కాంగ్రెస్ ఏసీబీ విచారణ జరుపుతామంటోందని, ముందుగా సీఎం బావమరిది మీద ఎంక్వైరీలు వేయాలని డిమాండ్ చేశారు.డీలిమిటేషన్ వల్ల రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని, దీంతో బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. ప్రస్తుతం ఉన్న నిష్పత్తి ప్రకారం డీలిమిటేషన్ చేపడితే ఎవరికీ అభ్యంతరాలు ఉండవన్నారు. పార్లమెంటులో ప్రస్తుతం ఎంపీ స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం వాటా ఉందని, ఇకపైనా ఈ శాతం తగ్గకుండా డీలిమిటేషన్ చేపట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీతో కలిసి పోటీ చేయబోమని, బీఆర్ఎస్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. పొత్తులు తమకు కలిసిరావన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చగలిగితే తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

## నేడు మాజీ స్పీకర్ శ్రీపాదరావు విగ్రహ ఆవిష్కరణ



### ఆవిష్కరించనున్న మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

జనోదయ : మంథని

మంథని మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కాలనీలో సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు విగ్రహ ఆవిష్కరణ తెలంగాణ ఐటి పరిశ్రమల మంత్రి దుద్దిల్ల శ్రీపాదరావు తనయుడు దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా జరగనున్నది. 1984లో ఇంటి స్థలం లేని నిరుపేదలకు శ్రీపాదరావు చొరవ తీసుకుని గోదావరి నదికి వెళ్లే రహదారి పక్కన ఇంటి స్థలాలు ఇప్పించారు. అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రజలు తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. వారు ఉంటున్న ప్రాంతానికి శ్రీపాద కాలనీ అని నామకరణం చేసుకున్నారు. అది ప్రస్తుతం మంథని మునిసిపాలిటీలో ఒకటవ వార్డుగా కొనసాగుతోంది. స్థానిక ప్రజలు కాంగ్రెస్ నాయకులు తమ ప్రియతమా నాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ం

## ఇ.వి. సతీష్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



జనోదయ : వరంగల్ ప్రతినిధి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తమ్ముడు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడిగా సేవలందించిన ఇ.వి. సతీష్ కుమార్ (56) బ్రెయిన్ హెమరేజ్ కారణంగా హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఇటీవల బ్రెయిన్ డెడ్ తో మరణించిన సందర్భంగా ఆదివారం హన్మకొండ లోని గాంధీనగర్‌లోని వారి స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.






# ఇంటర్ ఫలితాల్లో మంథని బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ

### ఎంపీసీలో 987మార్కులతో శ్రీజ, 975 మార్కులతో పెండ్యాల శ్రీనిధిల ప్రభంజనం



జనోదయ : మంథని

2026 ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు కాలేజీలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సత్తా చాటాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినా అత్యధిక మార్కులు కైవసం చేసుకుని మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఇంటర్మీడియట్ సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ మార్కులు సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. విద్యార్థులను ఆయా కళాశాలల అధ్యాపకులు అభినందించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కళాశాలకు చెందిన గుండోజు శ్రీజ 1000 మార్కులకు 987, పెండ్యాల శ్రీనిధి 1000 మార్కులకు గాను 975 మార్కులు సాధించి తమ సత్తా చాటారు. బైపీసీ విభాగంలో శనిగరం సుధీష్ణ 1000 మార్కులకు గాను 961 మార్కులు సాధించారు.ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వేముల మహిత 470 మార్కులకు 464 మార్కులు, తోట హాసిని 458, బైపీసీ విభాగంలో కోదూరి శివాని 440 మార్కులకు గాను 434 మార్కులు, నాగుల లక్ష్మీ ప్రసన్న430 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో గన్నవరం సమవర్ధిని 500 మార్కులకు 421, హెచ్ ఈ సి విభాగంలో బోయిని శ్రీ లాలిత్య 500 మార్కులకు గాను 478 మార్కులు సాధించి సత్తా చాటారు. ఈ ఏడాది ఇంతటి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, సహకరించిన అధ్యాపకులు వారి తల్లిదండ్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపల్ బాలోజీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రశాంతంగా యూపీఎస్సీ ఎన్డీఏ, ఎన్ఏ, సిడిఎస్ పరీక్ష

### హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ రవి



జనోదయ : హనుమకొండ

యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ( ఎన్డీఏ ), నావల్ అకాడమీ (ఎన్ ఏ ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ( సిడిఎస్ )-2026 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి.హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షలు నిర్వహించగా, పింగిలి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో కమాండ్ డిఫెన్స్ సర్వీస్ పరీక్ష జరిగింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యూపిఎస్సి ద్వారా నిర్వహించిన పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును, ఏర్పాట్లను పరిశీలించారు.హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించిన రెండు పరీక్ష కేంద్రాలలో 754 మంది అభ్యర్థులకు గాను మొదటి పరీక్షలో 517 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా మధ్యాహ్నం 2 నుండి 4:30 వరకు నిర్వహించిన రెండో పేపర్ పరీక్షకు 471 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.పింగిలి కళాశాలలో ఉదయం 9 నుండి 11 గంటల వరకు నిర్వహించిన సిడిఎస్ పరీక్ష ఫస్ట్ సెషన్ కు 209 మందికి గాను 84 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్ పరీక్షకు 88 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.నాలుగు నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన మూడో సెషన్ పరీక్షకు 103 మంది అభ్యర్థులకు గాను 40మంది పరీక్షరాశారని అధికారులు వెల్లడించారు.

## పాపిరెడ్డి కాలనీ ఫంక్షన్ హాల్ దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై రవి యాదవ్ ఆగ్రహం

### మౌలిక సౌకర్యాలు లేని హాల్‌లో పెళ్లిళ్లు ఎలా? వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్



జనోదయ : శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని పాపిరెడ్డి కాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మరబోయిన రవి యాదవ్, పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వ కాలంలో నిర్మించిన ఈ హాల్ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాడైపోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాల్‌లో విద్యుత్, నీటి సరఫరా లేకపోవడం, స్విచ్‌బోర్డులు, ఫ్యాన్లు పనిచేయకపోవడం, ఫాల్స్ సీలింగ్ దెబ్బతినడం, కిచెన్ పాడైపోవడం, బాత్‌రూములు అస్వచ్ఛంగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. కేవలం పైపై శుభ్రత పనులు చేసి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులలో కూడా పెళ్లిళ్లు నిర్వహించవచ్చని స్థానిక ఎమ్మెల్యే చెప్పడం దురదృష్టకరమని, ప్రజలపై అన్యాయం జరుగుతోందని రవి యాదవ్ మండిపడ్డారు. హాల్‌లో వెంటనే విద్యుత్, నీరు, వంటగది పరికరాలు, మరమ్మతులు, పారిశుధ్య చర్యలు, కాపలాదారు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను విస్మరిస్తే బీఆర్ఎస్ తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల కోసం నిర్మించిన హాల్… ప్రజలకే అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ యాదవ్,కె ఎన్ రాములు,వెంకట్ రెడ్డి,ఆర్.అనిత,నాగమణి, మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థినిలను సన్మానించిన విద్యార్థి సంఘం నాయకుడు డిగంబర్



జనోదయ : మంథని

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు కాలేజీలకు ఏమాత్రం తీసిపోని విధంగా మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతూ ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన గుండోజు శ్రీజ, పెండ్యాల శ్రీనిధిలను విద్యార్థి జేఏసీ నాయకుడు బెజ్జంకి డిగంబర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివారం ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను గుండోజు శ్రీజ 987, పెండ్యాల శ్రీనిధి 975 మార్కులు సాధించి బాలికల పాఠశాలలో ప్రథమ ద్వితీయ ర్యాంకులు సాధించగా దిగంబర్ సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చదివి ఇలాంటి ర్యాంకులు సాధించడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని బీసీ, ఎస్సీ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఆయన కోరారు. ఈ విద్యార్థుల తల్లి దండ్రులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

# ఆర్‌సీబీ ధనాధన్..

## సాల్ట్, కోహ్లీ, పటిదార్ వీర విహారం

## ముంబైపై బెంగుళూరు అద్భుత విజయం



**ముంబై:** డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అదరగొట్టింది. ఆదివారం వాంఖడే వేదికగా జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయం సాధించింది. ప్రముఖ సింగర్ ఆశా భోంస్లేకు ఘన నివాళులు అర్పించిన ఇరు జట్ల ప్లేయర్లు నల్లరిబ్బన్లు ధరించి మ్యాచ్ బరిలో దిగారు. టాస్ గెలిచిన ముంబై..ఆర్‌సీబీని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది.వరుస మ్యాచ్‌ల్లో విఫలమవుతున్న ఫిల్ సాల్ట్(36 బంతుల్లో 78, 6ఫోర్లు, 6సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగగా, విరాట్ కోహ్లీ(38 బంతుల్లో 50, 5ఫోర్లు, సిక్స్), రజత్ పటిదార్(20 బంతుల్లో 53, 4ఫోర్లు, 5సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 240/4 స్కోరు చేసింది. ముంబైపై ముంబైలో ఆర్‌సీబీకి ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. లక్ష్యఛేదనలో ముంబై 20 ఓవర్లలో 222/5 స్కోరు చేసింది. రూథర్‌ఫర్డ్(31 బంతుల్లో 71 నాటౌట్, ఫోర్, 9సిక్స్‌లు)ఒంటరిపోరాటం చేశాడు. బౌల్ట్ బౌలింగ్‌లో డీప్ స్క్వేర్ లెగ్‌లో కోహ్లీ కండ్లు చెదిరే రీతిలో సిక్స్‌తో ఖాతా తెరువగా, తానేం తక్కువ కాదన్నట్లు సాల్ట్ కూడా జత కలువడంతో పరుగుల వరద మొదలైంది. ముఖ్యంగా సాంట్నర్ వేసిన ఐదో ఓవర్‌లో సాల్ట్ హ్యాట్రిక్ సిక్స్‌లకు తోడు ఫోర్‌తో 22 పరుగులు పిండుకున్నాడు. ఇక లాభం లేదనుకుని బుమ్రాను దించగా ఆరు పరుగులు వచ్చినా పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 71 పరుగులు చేసింది.బౌలింగ్ మార్పుగా వచ్చిన మయాంక్‌ను హ్యాట్రిక్ ఫోర్లకు తోడు సిక్స్‌తో సాల్ట్ మరోమారు చెలరేగి 25 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని శార్దుల్ విడదీయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. సాల్ట్ ఔటైనా.. కోహ్లీ, పటిదార్ అదే దూకుడు కొనసాగించారు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు బౌండరీలు బాదడంతో వాంఖడే స్టేడియం హోరెత్తిపోయింది.భారీ లక్ష్యఛేదనలో ముంబైకి రోహిత్‌శర్మ(19) రిటైర్డ్‌హర్ట్ రూపంలోఎదురుదెబ్బ తగిలింది.మిడిలార్డర్‌లో సూర్యకుమార్(33), హార్దిక్(40) ఆకట్టుకున్నా.. లాభం లేకపోయింది. ఆఖర్లో రూథర్ ఫర్డ్..ఆర్‌సీబీ బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ ఏకంగా తొమ్మిది సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. సహచరుల సహకారం లేకపోయినా రూథర్‌ఫర్డ్ పోరాటం ఆకట్టుకుంది.

# సైబరాబాద్ లో వీకెండ్, స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్

## 240 మందిపై కేసులుహెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతునవారిపై పై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దృష్టి



జనోదయ : శేరిలింగంపల్లి

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి-1 రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 240 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.193 ద్విచక్ర వాహనదారులు,09 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే-199 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,32 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,09 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత-2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ఠ శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం(2026 ఏప్రిల్ 06 నుండి 2026 ఏప్రిల్ 11 ) లో మొత్తం 86 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 02 మందికి జరిమానా, జైలు శిక్ష,01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 83 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

## డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్



జనోదయ : తొర్రూరు

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు బిఆర్కె న్యూస్ ప్రతినిధి దురుసోజు వీరాంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను ఆదివారం మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ ను పరామర్శించి ప్రమాదానికి గల కారణాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిపిఆర్ఓ మాట్లాడుతూ.. వాహనదారులు యాక్సిడెంట్లు కాకుండా ఉండాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు.మహబూబాబాద్ జిల్లాలో కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ డాక్టర్ శబరీష్, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం పై ప్రత్యేక చర్యలు తీసుకొని మండల వారీగా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.వార్తల సేకరణలో వివిధ ప్రదేశాలకు వెళ్ళు సమయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వెళ్లి వచ్చే క్రమంలో టూవీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్లో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు వహించాలని, వేసవి కాలంలో ఆరోగ్య నియమాలు పాటించాలని ఆయన కోరారు.డిపిఆర్ఓ వెంట జర్నలిస్టులు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, కొండ సతీష్, పోల్ రాజు, బజ్జూరి వాసు, కందికొండ కుమార్, పి.బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులు

## ఏఐటియుసి నాయకులు ఎం ఎ గౌస్ వెల్లడి



జనోదయ : గోదావరిఖని

గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచకుండా హోల్సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణంలో ఖని కూరగాయల మార్కెట్ కి చెందిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... కూరగాయల మార్కెట్ లో పని చేసే హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని హోల్సేల్ వ్యాపారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. హమాలీలకు కూలీ రేట్లు పెంచక నాలుగు సంవత్సరాలు గడిచిందని, ఇంకా పాత కూలీ రేట్లు చెల్లిస్తూ హమాలీ లను శ్రమ దోపిడి కి గురి చేస్తూ లక్షల రూపాయలు హోల్ సేల్ వ్యాపారులు లాభాలు గడిస్తూ వారికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఇచ్చే కూలీ రేట్లు సరిపోక నిత్యావసర వస్తువులు, ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫిజుల తదితర అవసరాలకు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, అయినా రెండు మూడు సార్లు చర్చలు జరిగినా ఎలాంటి అంగీకారం జరుగలేదని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో హోల్సేల్ వ్యాపారులు చెల్లించే కూలీ రేట్లు హమాలీ కుటుంబాల పోషణకు సరిపోవడం లేదని కనుక వెంటనే హోల్ సేల్ వ్యాపారులు స్పందించి హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలి పెల్లి సతీష్, జానీ మియా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలతో మానసిక వికాసం

**రాష్ట్రవ్యాప్తం చేస్తే చక్కటి ఫలితాలు సాధన సాధ్యం**
**సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చి**
**గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి**
**రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్**
**వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర**
**అధ్యక్షులు ఖాజా విరాహత్ అలీ**

**జనోదయ : గజ్వేల్ ఆర్ సి**

గ్రంథాలయాలు నిశ్శబ్ద అధ్యయనంతో పాటు మానసిక వికాసానికి దోహదపడనుండగా, సెయింట్ మేరీస్ చేపట్టిన ఇంటింటా గ్రంథాలయ కార్యక్రమం చక్కటి ఫలితాలు ఇస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు ఖాజా విరాహత్ అలీ స్పష్టం చేశారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ఇంటింటా గ్రంథాలయ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. చారిత్రక పుస్తకాలతో పాటు ఆధునిక




త జోడించి నేటితరం సమాజానికి అందిస్తే చక్కటి ఫలితాలు సాధించవచ్చని, ఆ దిశగా దృష్టి పెట్టిన నిర్వాహకులు ఇన్నారెడ్డి ప్రశంసించక తప్పదని స్పష్టం చేశారు. ముఖ్యంగా 30 వేల పుస్తకాలను 3వేల మందికి పంచడం లక్ష్యంగా పెట్టుకోగా, ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో చేపట్టి రాష్ట్రవ్యాప్తం కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెస్తామని పేర్కొన్నారు. గ్రంథాలయాలు నిశ్శబ్ద వాతావరణం సృష్టించనుండగా, నూతన, చారిత్రాత్మక, సాహిత్య, సైన్స్, ఇతిహాసాది అంశాలపై అవగాహన పెరిగి దేశ భవిష్యత్తులో ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. మానవ నాగరికత, ఆధునిక, సాంకేతిక విజ్ఞానాన్ని రక్షించి కొత్త తరానికి అందించే ఈ మహోత్తర కార్యక్రమ విజయవంతానికి తమ వంతు సహకారం ఉంటుందని చెప్పారు. ఇంటింటా గ్రంథాలయాలు విజ్ఞానాన్ని, వికాసాన్ని, వివేకాన్ని పంచే జ్ఞాన కేంద్రాలుగా విలసిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి పుస్తకం మిస్సైల్ వలే పనిచేస్తుందని, అందులోని జ్ఞాన శక్తిని ఏకాగ్రతతో పొందవచ్చని తెలిపారు. నేటి యుద్ధాల్లో విధ్వంసర క్షిపణులు మానవుని మేధస్సు నుంచి పుట్టుకు రాగా, ప్రపంచ అభివృద్ధికి వినియోగిస్తే బాగుండేదని చెప్పారు. జ్ఞాన కేంద్రాలతో విశ్లేషణాత్మక శక్తి పెరుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల్లో చిన్నప్పటి నుండే పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించాలని కోరారు. 25 ఏళ్ల ప్రస్థానంలో వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉన్నత శిఖరాలకు చేర్చిన సెయింట్ మేరీస్ రాష్ట్రంలోని అగ్రశ్రేణి పాఠశాలల్లో ఒకటిగా నిలుస్తుందని అన్నారు. విద్యను స్థిరాస్తిగా భావిస్తే ఉన్నత శిఖరాలకు చేరడం పెద్ద కష్టమేమీ కాదని స్పష్టం చేస్తూ ఆ దిశగా నేటి తరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అయితే పుస్తక పఠనంతో విలువలతో కూడిన విద్య, నైపుణ్యత, మేధోశక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ నేత ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతా

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**జనోదయ :హుస్నాబాద్**

హుస్నాబాద్ నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆదివారం నియోజకవర్గంలోని చిగురు మామిడి, హుస్నాబాద్, హుస్నాబాద్ మండలం లోని పలు గ్రామాలలో పర్యటించారు. చిగురుమామిడి మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 1 నుండి 12 తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను తీసుకొస్తుండడంతో స్థల పరిశీలన చేశారు. పాఠశాల ప్రాంగణంలోనే ప్రైమరీ, హై స్కూల్, జూనియర్ కాలేజీ ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. రైతు వేదిక వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై వ్యవసాయ పనిముట్లు రైతులకు పంపిణీ చేశారు. అలాగే హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి లో రూ.21.30 లక్షల వ్యయంతో మత్రి పంపు చెక్ డాం ఫీడర్ ఛానల్ కి శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ పట్టణంలో కొత్తచెరువు ఎల్లమ్మ చెరువు, పల్లె చెరువు, అభివృద్ధి పనులు పరిశీలించారు. పల్లె చెరువు కట్ట సుందరీకరణ అ



భివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు, కట్ట సుందరీకరణ పనులపై ఆరా తీశారు. చెరువులో నిర్మితమవుతున్న గ్లాస్ బ్రిడ్జి పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత ఉండాలని చెప్పారు. అనంతరం జిల్లెల్ల గడ్డ వద్ద అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో జరుగుతున్న పనులపై అటవీశాఖ అధికారులు మంత్రికి వివరించారు. ఇప్పటికే అర్బన్ ఫారెస్ట్ లో మట్టి ట్రాక్, వాటర్ పంపు అధికారులు మంత్రికి వివరించారు. పిల్లలను ఆకట్టుకునే విధంగా చిల్డ్రన్ పార్క్ లో క్రీడా సామగ్రి పెట్టాలని ఆదేశించారు. సహజ సిద్ధంగా ఉండే వాటర్ ఫాల్స్ పై దృష్టి సారించాలన్నారు. పుట్టలోద్ది, గాడిద లొద్ది మధ్య లక్నవరం లాంటి కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సూచించారు. వాచ్ టవర్లు ఎత్తైన గుట్టలపై నిర్మించాలన్నారు. అక్కన్నపేట మండలంలోని పోతారం (జె) గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వర్షాధారిత పంటల అభివృద్ధి పథకం కింద రైతులకు కూరగాయలు పెట్టెలు అందజేశారు. కూరగాయలు, ఆయిల్ ఫామ్, పట్టు పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత పంటలు ఆదాయాన్ని ఆర్థిక పంటలను వేయాలన్నారు. కూరగాయల పంటలు వేయలేని రైతులు ఆయిల్ ఫాం సాగు చేయాలన్నారు. నంగునూరు మండలం నర్మెట లో గల ఆయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేస్తూ అక్కన్నపేట లో కూడా ఆయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి గ్రామానికి 50 నుండి 100 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేసేలా సర్పంచులు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ ఫామ్ పంట ద్వారా అధిక దిగుబడితోపాటు మంచి ఆదాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట సంబంధించిన శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బెల్లంపల్లి పోలీసు హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన డీజీపీ

**లాంఛనంగా కన్నెపల్లి నూతన**
**పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం**

**జనోదయ, బెల్లంపల్లి,ఏప్రిల్ 12:**

బెల్లంపల్లి ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని దుర్గామాత దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. 1998వ సంవత్సరంలో బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా పనిచేసిన రోజులను ఆయన పోలీసు అధికారులతో కలిసి గుర్తు చేసుకున్నారు. తాను బెల్లంపల్లిలో పని చేసిన కాలంలో ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ లో దుర్గాదేవి ఆలయం, చర్చి, మసీదు నిర్మాణాల కోసం భూమి పూజ నిర్వహించి దుర్గా మాత విగ్రహ ప్రతిష్టాపన చేపట్టిన విషయాలను గుర్తుకు తెచ్చుకున్నారు. 1998 వ సంవత్సరంలో అప్పటి జ్ఞాపకాలను రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంపత్, పోలీస్ సిబ్బంది డిజిపి శివధర్ రెడ్డికి ఫోటోల రూపంలో చూపెట్టడంతో అప్పటి పరిస్థితులను గుర్తుచేసుకొని భావోద్వేగం చెందారు. బెల్లంపల్లి ప్రాంతం తో పాటు పోలీసు హెడ్ క్వార్టర్స్ తో తనకు ఉన్న సంబంధాలను గుర్తు చేసుకుని పోలీసు అధికారులు, సిబ్బందితో అప్పటి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు, డ్రైవర్లతో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో రహదారి భద్రత కమిటీలను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని కన్నెపల్లిలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని డీజీపీ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించాలని స్థానిక పోలీస్ అధికారులను ఆయన కోరారు. పోలీసు సేవలను విస్తృత పరిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని



కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ , బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ,మల్టీ జోన్ ఐ జి చంద్ర శేఖర్ రెడ్డి, రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తోపాటు పలువురు సిఐలు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.